క్లుప్తంగా

సిరిసిల్లకు నేడు కేటీఆర్ రాక

సిరిసిల్ల: సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు మంగళవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ముస్తాబాద్ మండలం తెర్లుమద్దిలో చౌడాలమ్మ జాతరలో పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు పార్టీ మండలస్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరవుతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రామలక్ష్మణపల్లెల్లో పెద్దమ్మ జాతరలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో తంగళ్లపల్లి మండల పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొంటారు. 3 గంటలకు అంకుసాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణకు హాజరవుతారు.

17న పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాలలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న శ్రీపెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు హాజరుకావాలని మాజీమంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో సంఘం సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఎల్లారెడ్డిపేటలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి తదితరులను వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు. ముదిరాజ్ సంఘం నాయకులు నిమ్మల బాబు, బత్తిని శ్రీనివాస్, దేవేందర్, దేవేందర్, రమేశ్, రవీందర్, పి.రాజం పాల్గొన్నారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి

సిరిసిల్లటౌన్: నేరెళ్ల బాధితులకు వెంటనే న్యాయం చేయాలని బహుజన స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సద్దాం కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. నేరెళ్ల ఘటనలో బాధితులకు వెంటనే ప్రభుత్వం ఆర్థికసాయం చేయాలన్నారు. సీఎం గతంలో ఇచ్చిన హామీతో నేరెళ్ల సంఘటన జరిగిన సమయంలో ఇక్కడ పనిచేసిన ఎస్పీ, ఇతర అధికారులపై న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. కేటీఆర్‌కు సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. నిమ్మపల్లి రాజ్‌కుమార్, మరటి దినేష్, భరత్, నరేష్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అల్మాస్‌పూర్‌కు చెందిన బూరుగుపల్లి నరేందర్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో నరేందర్‌తో చదువుకున్న చిన్ననాటి మిత్రులు ఉత్తం ఆంజనేయులు, బత్తిని శ్రీధర్, బొద్దు పర్శరాములు, కంచర్ల తిరుపతి, దానవేని పర్శరాములు, గొడుగు రవి రూ.20వేల నగదును మృతుడి భార్య దివ్య, తల్లితండ్రులు బాల కృష్ణయ్య, దేవేంద్రకు అందించారు.

పరామర్శ

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో బీఆర్ఎస్ నాయకుడు వంగల సురేందర్ తండ్రి మురళి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు సోమవారం పరామర్శించారు. నిజామాబాద్ మాజీ సర్పంచ్ కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. సింగిల్‌విండో చైర్మన్ నర్సయ్య, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, కౌన్సిలర్ మహేశ్, లింగంపేట ఎంపీటీసీ రమేశ్‌రావు, నాయకులు బైరగోని రాజేశం, షాదుల్, దేవరాజు, రహీం తదితరులున్నారు.

'గాలికుంటు' నివారణ టీకాలు



హన్మాజిపేటలో టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేటలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య కేంద్రంలో గేదెలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్‌పోలింగ్

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి వివరించారు. ఓటరుగా నమోదు, ఓటరు జాబితా, ఎన్నికల్లో పోటీ, ప్రచారం, పోలింగ్ కేంద్రం, వంటి అంశాలను ప్రదర్శించారు. ఎన్నికలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు రాధాకిషన్‌రావు, సోషల్ టీచర్ జోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు కట్టలపై నడిచేదెలా?



కొండచెరువు కట్టపై చెట్లతో మూసుకుపోతున్న దారి



గూడెంలో చెరువు కట్టకు ఇరువైపులా గుబురుగా పెరిగిన చెట్లు

- చెట్లకు జంగల్ కటింగ్ చేపట్టని అధికారులు
- కట్టలపై కనుమరుగవుతున్న దారులు
- పట్టించుకోని పాలకులు

ముస్తాబాద్: చెరువు పల్లె ప్రజలకు ఆదరువు. అలాంటి చెరువులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ముఖ్యంగా తుమ్మచెట్లతో చెరువు గట్లపై నడవలేని పరిస్థితి. మండలంలోని చెరువుల ఆనవాళ్లు కోల్పోకుండా రక్షించాలని రైతులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలతో జంగల్ కటింగ్ చేపట్టారు. దీంతో రెండేళ్లుగా పెరిగిన మొక్కలు, చెట్లతో చెరువులు కనిపించని పరిస్థితి నెలకొంది. మండలంలో చెరువులు, కుంటలు 55 వరకు ఉండగా అందులో 25 చెరువుల వరకు వెంటనే జంగల్ కటింగ్ చేపట్టాలని ఆయాగ్రామాల రైతులు కోరుతున్నారు.

అధికారుల సమన్వయ లోపం..

చెరువుల నిర్వహణ నీటి పారుదల శాఖ చూస్తుంది. ఇందుకు ప్రభుత్వం ఆరునెలల క్రితమే లష్కర్లను నియమించింది. మండలంలో 15మంది వరకు లష్కర్లు, ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు. చెరువుల నిర్వహణతోపాటు, కెనాల్స్, నీటి విడుదల వంటి అంశాలను నిత్యం లష్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలి. లష్కర్లు లేని సమయంలో రెండేళ్ల క్రితం ఆయా గ్రామ పంచాయతీల తీర్మానాల మేరకు ఉపాధిహామీ కూలీలతో జంగల్ కటింగ్ చేపట్టారు. ఇప్పుడు పెరిగిన చెట్ల బుష్ కటింగ్‌ను లష్కర్లు చేపట్టాలి లేదా ఉపాధిహామీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. రెండు జరగకపోవడంతో తటాకాలపై జంగల్ పెరిగిపోయింది.

పొంచివున్న ప్రమాదం..

ముస్తాబాద్ పెద్దచెరువు, గూడెం, పోతుగల్ గ్రామాల మధ్య వున్న కొండసముద్రం, గూడెం చింతల్‌చెరువు, చీకోడులో చింతలచెరువు, ఆవునూర్ పెద్ద చెరువు, బందనకల్‌లో ఊరచెరువు, పోతుగల్‌లో వీరసముద్రం, మద్దికుంట చెరువు, నామాపూర్ కొత్తచెరువు, ఊర చెరువు, కొండాపూర్ ఊర చెరువు, తెర్లుమద్ది చెరువు, చిప్పలపల్లిలో బ్రహ్మణచెరువులపై జంగల్ కటింగ్ చేపట్టాలి. భారీగా పెరిగిన చెట్లు, కొమ్మలతో దారులు మూసుకుపోయాయి. దీంతో రైతుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉపాధిహామీ సిబ్బందితో జంగల్ కటింగ్ చేపట్టినా వారు కేవలం దారిని మాత్రమే క్లియర్ చేస్తున్నారు. కొండ సముద్రంపై నాలుగు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పెరిగిన చెట్లతో దారి మూసుకుపోయి, ప్రమాదాలు జరుగుతున్నాయి. నీటి పారుదలశాఖ, ఉపాధిహామీ అధికారులు సమన్వయంతో పనిచేసి చెరువులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి



చెరువుల నిర్వహణకు ఏటా నిధులు కేటాయించాలి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువులను కాపాడింది. కొత్త ప్రభుత్వం చెరువుల కోసం నిధులు కేటాయించాలి. గొలుసుకట్టు చెరువులను కాపాడుకోవాలి. కొండ సముద్రం రూపురేఖలు కోల్పోతుంది.

– బొంపెల్లి సురేందర్‌రావు, గూడెం

మరమ్మతులు చేపట్టాలి



చెరువు కట్టలు డ్యామేజీ కాకుండా చూడాలి. గతంలో ఉపాధిహామీ ద్వారా చెరువుల కట్టలు బాగుచేసుకున్నాం. లష్కర్లను కూడా నియమించారు. వారితో పనులు చేయించాల్సిన బాధ్యత పాలకులదే. రైతులకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేపట్టాలి.

– కొమ్ము బాలయ్య, మాజీ సెస్ డైరెక్టర్

త్వరలోనే చేపడుతాం



ఇదివరకు ఉపాధిహామీ ద్వారా జంగల్ కటింగ్ చేపట్టారు. ప్రస్తుతం లష్కర్లు యాసంగికి నీరందించే పనుల్లోనే బీజీగా వున్నారు. త్వరలో ఈజీఎస్ లేదా, లష్కర్ల ద్వారా జంగల్ కటింగ్ చేపడుతాం. చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– రవికుమార్, డీఈఈ, ముస్తాబాద్

సిద్ధోగ వేడుకలకు రండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు



ఎమ్మెల్యే కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నారాయణపూర్‌లో ఈనెల 12న నిర్వహించే ఎల్లమ్మ సిద్ధోగానికి హాజరు కావాలని కోరుతూ గౌడ సంఘం నాయకులు సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్‌లకు ఆహ్వానం పలికారు. గౌడ సంఘం నాయకులు బొల్గం రాధాకృష్ణాగౌడ్, బొల్గం గోవర్ధన్‌గౌడ్, లింగాల యాదగిరిగౌడ్, పాముల దేవరాజుగౌడ్, పల్లె సాయిగౌడ్, జవ్వాజి మహేశ్‌గౌడ్, మెరుగు గోవర్ధన్‌గౌడ్, నాగపురి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

పద్మశాలీలపై వ్యాఖ్యలు అర్థరహితం

సిరిసిల్లటౌన్: పద్మశాలీలు, సిరిసిల్ల నేత కార్మికుల ఆత్మగౌరవాన్ని కించపరుస్తూ కాంగ్రెస్ ముఖ్య నాయకుడు వ్యాఖ్యలు చేయడం అర్థరహితమని పద్మశాలీ యూత్‌వింగ్ జిల్లా అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి సిరిసిల్లలోని పద్మశాలీ సంఘంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సదరు నేత వెంటనే పద్మశాలీ సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కౌన్సిలర్లు దార్ల సందీప్, గెంట్యాల శ్రీనివాస్, నాయకులు రామ్మోహన్, మోర రవి, సబ్బని హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలకు ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగాలు

- భార్యకు రెండు ఉద్యోగాలు, భర్తకు ఒక ఉద్యోగం
- కొదురుపాక దంపతులకు అరుదైన అవకాశం
- సీఎం రేవంత్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేత

బోయినపల్లి(చొప్పదండి): ఒకేసారి ఒకే వేదికపై భార్యా భర్తలు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అరుదైన అవకాశం మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన సట్ల అనీల్‌కుమార్ –రజిత దంపతులకు సోమవారం దక్కింది. భార్యాభర్తలిద్దరూ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. వివరాల్లోకి వెళ్తే కొదురుపాకకు చెందిన సట్ల అనిల్‌కుమార్ ఎంకాం, బీఈడీ, ఎల్ఎల్‌బీ చేశాడు. రజిత ఎమ్మెస్సీ, బీఈడీ చేసింది. ఇద్దరు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. అనిల్‌కుమార్ టీజీటీ సోషల్‌గా ఎంపికయ్యాడు. అనిల్‌కుమార్ భార్య రజిత రెండు ఉద్యోగాలు సాధించింది. ఇందులో పీజీటీలో ఫిజికల్ సైన్స్, జెఎల్‌లో ఫిజిక్స్ రెండు ఉద్యోగాలు సాధించడం విశేషం. ఒకేసారి ఉద్యోగాలు సాధించిన భార్యాభర్తలను గ్రామస్తులు అభినందించారు.



నియామక పత్రాలు చూపుతున్న అనిల్‌కుమార్ - రజిత

ఆడబిడ్డలకు వరం 'కల్యాణలక్ష్మి'



తంగళ్లపల్లి(సిరిసిల్ల): నిరుపేద ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మీ పథకం వరమని ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకట రమణా రెడ్డి అన్నారు. సోమవారం మండలానికి చెందిన 45 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ షఫీ, ఎంపీటీసీలు వొగ్గు నర్సయ్య యాదవ్, తీగల పుష్పలత నాగయ్య, కరివేద స్వప్న కరుణాకర్ రెడ్డి, కాత సుమలత మల్లేశం, ఎంపీడీవో శ్రీనివాస మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభయహస్తం, ప్రజాపాలన సేవాకేంద్రాలు ప్రారంభం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం అభయ హస్తం, ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ వుట్కూరి వెంకట రమణా రెడ్డి ఎంపీడీవో బద్రిశ్రీనివాస మూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమణా రెడ్డి మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో తప్పనిసరిగా అభయహస్తం, ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటుచేయాలని తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సేవాకేంద్రం ఉదయం 10.30 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందన్నారు.



వేములవాడ అర్బన్ : ప్రారంభిస్తున్న ఎంపీడీవో

132 మందికి నియామకపత్రాలు

- డీఎల్‌గా 13, జేఎల్‌గా 37,
- టీజీటీగా 82 మంది నియామకం

సిరిసిల్ల: జిల్లాకు చెందిన 132 మంది నిరుద్యోగులు సోమవారం హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లో నియామకపత్రాలు అందుకున్నారు. ఇందులో మహిళలు 71 మంది ఉండగా.. పురుషులు 61 మంది ఉన్నారు. జిల్లాకు చెందిన వారు డిగ్రీ లెక్చరర్(డీఎల్)గా 13, జూనియర్ లెక్చరర్(జేఎల్)గా 37, ట్రైన్డ్ గ్రేడ్ టీచర్లు(టీజీటీ)గా 82 మంది ఎంపికయ్యారు. వీరంతా నియామకపత్రాలు అందుకున్నారు. చాలా కాలానికి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరగడంతో నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు.



నియామక పత్రం అందుకుంటున్న కామేశ్వరి

పెద్దచెరువు నీటి విడుదల నిలిపివేత

ముస్తాబాద్: ముస్తాబాద్ పెద్ద చెరువు షట్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తెరవడంతో నీరు ఎల్లమ్మ వాగులోకి వృథాగా పోతోందని డీఈఈ రవికుమార్ తెలిపారు. రైతుల ఫిర్యాదుతో సోమవారం చెరువును పరిశీలించారు. కొందరు గుర్తు తెలియని రైతులు చెరువు షట్టర్‌ను లేపడంతో నీరు కిందికి వెళ్తుందని, యాసంగిలో పంటలకు సాగునీరందేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుతం మానేరు ప్రాజెక్టులో టీఎంసీ నీరు ఉందన్నారు. మల్లన్నసాగర్ నీటిఫ్లో తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, రైతులు నీటిని వృథా చేయొద్దన్నారు. ఏఈ వంశీకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, లష్కర్లు, తదితరులు ఉన్నారు.



నీటిని పరిశీలిస్తున్న డీఈ రవికుమార్

గిరిజన యువకుడికి మూడు ఉద్యోగాలు

వీర్నపల్లి : మండలంలోని రంగంపేటకు చెందిన యువకుడు ఏకంగా మూ డు ఉద్యోగాలు సాధించారు. గిరిజన వ్యవసాయ కుటుంబానికి చెందిన లాకవత్ రాజు, సరిత దంపతుల కుమారుడు సంతోష్ మూడు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు అభినందించారు.

జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ రాచబాట

- ఈనెల 7న జిల్లాకు ముఖ్యమంత్రి రాక
- వేములవాడ బహిరంగ సభను విజయవంతం చేయాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్, పక్కన కేకే మహేందర్‌రెడ్డి, కటుకం మృత్యుంజయం

సిరిసిల్లటౌన్: జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రాచబాటలు వేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 7న జిల్లా పర్యటన సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్‌హాలులో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. కార్మిక, ధార్మికక్షేత్రాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. జిల్లా పరిధిలో విద్య, వైద్యం, రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. పరిశ్రమలు, ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో సీఎం పర్యటిస్తారని ఇందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మహాశివరాత్రి సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పించి, అక్కడ నిర్వహించే బహిరంగసభలో ప్రసంగిస్తారన్నారు. కాంగ్రెస్ అందిస్తున్న ప్రజాపాలనను విస్తృత ప్రచారం చేస్తూ.. ప్రతి కార్యకర్త సీఎం సభకు ప్రజలను పెద్దెత్తుల వచ్చేలా చూడాలని కోరారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సీనియర్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, సూర దేవరాజు, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, ఆడెపు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవకాశం
- దరఖాస్తుకు ఈనెల 15వ తేదీ ఆఖరు

సిరిసిల్ల: తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్(టీఐడీఈఎస్) ఆధ్వర్యంలో లైట్‌మోటార్ వెహికల్(ఎల్ఎంవీ), హెవీ మోటార్ వెహికల్(హెచ్ఎంవీ)లో గ్రామీణ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ రాఘవన్ సోమవారం తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, ఎంప్లాయిమెంట్ జనరేషన్, మార్కెటింగ్ మిషన్ సంయుక్తంగా మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి డ్రైవింగ్ శిక్షణ కేంద్రంలో ఉచిత వసతితో శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ శిక్షణ ఈనెల 16 నుంచి ప్రారంభమవుతుందని, ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 20–28 మధ్య ఉండాలని వివరించారు. ఆసక్తి గల 10వ తరగతి సర్టిఫికెట్, ఆధార్, రేషన్‌కార్డ్, కులం, ఆదాయం, బ్యాంక్ ఖాతా జి రాక్స్ ప్రతులు, 6 ఫొటోలతో రావాలని సూచించా రు. వివరాలకు 89854 31720లో సంప్రదించాలని తెలిపారు.

మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వేములవాడ: ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని అన్ని మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలని పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్రం ఆధ్వర్యంలో మజీద్ కమిటీల అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. వేసవి దృష్ట్యా చలువపందిళ్లు, లైట్లు నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, పారిశుధ్య పనులు చేపట్టి ఏర్పాట్లు చేయాలని కోరారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బాబున్, ముస్లిం కమిటీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ వలి, మాజీ అధ్యక్షుడు అంజద్ పాషా, మసీద్ కమిటీల అధ్యక్షుడు షేక్ ఇమామ్, ఎండీ సర్వర్‌పాషా, అబ్దుల్ రజాక్, మహమ్మద్ బషీ ర్, అబ్దుల్ రఫీక్, ముస్లిం నాయకులు షేక్ యూసుఫ్, రహీం, కమిటీ సభ్యులు మతపెద్దలు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మున్సిపల్ కమిషనర్ లావణ్యను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ కళ, సిబ్బంది

సిరిసిల్లటౌన్: మెప్మా ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ మెప్మా ఆర్పీల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, చైర్‌పర్సన్ జిందం కళను ఘనంగా సన్మానించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని వక్తలు కోరారు. పట్టణంలోని ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

7న ఉపాధిహామీ సామాజిక తనిఖీ

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల7న ఉపాధిహామీ సామాజిక ప్రజావేదికను కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్తయ్య సోమవారం తెలిపారు. మండలంలో ఏప్రిల్1, 2022 నుంచి మార్చి 31 2023 వరకు జరిగిన పనులపై 14వ సామాజిక తనిఖీ బృందం ఈనెల 1నుంచి 7వరకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

వైస్ ఎంపీపీ రాజీనామాకు ఆమోదం

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండల వైస్ ఎంపీపీ రేగులపాటి రవిచందర్‌రావు తన వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా లేఖ పత్రాన్ని ఇటీవల జెడ్పీ సీఈవో ఉమారాణికి అందించిన విషయం తెలిసిందే. వైస్ ఎంపీపీ రాజీనామాను ఆమోదించినట్లు ఎంపీడీవో రాజీవ్ మల్‌హోత్రకు ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు.

ఆలయానికి విరాళం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి పెద్దలింగాపూర్ మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్ రెడ్డి రూ.10,116 విరాళంగా అందించారు. వల్లంపట్ల గౌడ సంఘం నాయకులకు విరాళం అందజేశారు.

డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు

సిరిసిల్లక్రైం: ఇసుక ట్రాక్టర్‌పై నమోదైన కేసు విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి సోమవారం తెలిపారు. పెద్దూరుకు చెందిన కొంపెల్లి విష్ణువర్ధన్ ఇసుక ట్రాక్టర్‌పై పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. నమోదైన కేసును తీసివేస్తానని అదే గ్రామానికి చెందిన తుంగపల్లి అజయ్ రూ.50వేలు బాధిత ట్రాక్టర్ యజమానిని డిమాండ్ చేశాడు. దీనిపై ఫిర్యాదు అందడంతో డబ్బులు డిమాండ్ చేసిన అజయ్‌పై పోలీసులు కేసునమోదు చేశారు. పోలీస్ అధికారులు తమకు సన్నిహితులని నమ్మిస్తూ డబ్బులు అడిగితే తెలపాలన్నారు.

వందశాతం పల్స్ పోలియో లక్ష్యం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి పీహెచ్‌సీల పరిధిలోని 41 కేంద్రాలలో సోమవారం వరకు 5886 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు ప్రభుత్వ వైద్యాధికారి స్రవంతి తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో వేయనున్నట్లు తెలిపారు. రెండు మండలాల్లో 164 మందితో ఇంటింటి సర్వే చేపడుతున్నామని, వందశాతం పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు.

కేక్ కట్‌చేసిన నాయకులు

ముస్తాబాద్: ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్‌కుమార్ జన్మదిన వేడుకలను మండలంలోని ఆవునూర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ నర్సయ్య, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల్‌కార్ శ్రీనివాస్, వేణు, రాంరెడ్డి పాల్గొన్నారు

వీర్నపల్లి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సోమవారం ఏఐసీసీ ఓబీసీ జాతీయ కో ఆర్డినేటర్ రుద్ర సంతోష్ కుమార్, జన్మదిన వేడుకలను నాయకులు, అభిమానులు జరిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తంగళ్లపల్లి: మండలంలోని పలుగ్రామాల్లో స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ పూర్మాని మంజుల లింగారెడ్డి భూమిపూజ చేశారు. నేరెళ్లలో బోరు మోటారు, మహిళా సంఘ భవనం, జిల్లెల్లలో ఆదర్శ రెడ్డి సంఘం భవనం నిర్మాణ అదనపు పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగా రెడ్డి, మాజీసర్పంచ్ మంజుల మల్లేశం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని డే కేర్ కేంద్రంలో వృద్ధులకు బొమ్మకంటి సుమతి–అశోక్ దంపతులు సోమవారం పండ్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమతి–అశోక్ దంపతులను పలు వురు అభినందించా రు.